వాహనాల బారులు



అలిపిరిలోని భద్రతా తనిఖీల కేంద్రం ఆదివారం వాహనాలతో కిక్కిరిసిపోయింది. తనిఖీ కేంద్రం నుంచి గరుత్మంతుడి విగ్రహం ముందున్న ఆర్చ్ వరకు వాహనాలు బారులుతీరాయి. శ్రీవారి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు తిరుమల చేరుకుంటున్నారు. దీంతో వాహనాలను తనిఖీ చేసే అలిపిరి వద్ద వాహనాల సంఖ్య పెరిగిపోయిన క్రమంలో భద్రతా సిబ్బంది వేగవంతంగా తనిఖీ చేసి తిరుమలకు పంపారు. సాయంత్రం తర్వాత చెక్‌పాయింట్ వద్ద సాధారణస్థితి నెలకొంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన భక్తులు



వారాంతపు సెలవుల నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 397మంది, రూ.200 శీఘ్ర దర్శనంలో 3,219.. రూ.50ప్రత్యేక దర్శనంలో 3,650 మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,090మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,234, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 321మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 234మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 98మంది పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,718 అమ్ముడుపోయాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

వీఆర్‌కు గాజులమండ్యం

సీఐ, ఎస్‌ఐ?

రేణిగుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్‌ను వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. స్ర్కాప్ లారీ తనిఖీ సందర్భంగా లంచం డిమాండు చేశారన్న అంశంపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. నాలుగు రోజుల కిందట కేఎల్ఎం హాస్పిటల్ కూడలిలో గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో తిరుపతి విమానాశ్రయ సమీపంలోని ఓ పరిశ్రమకు చెందిన స్ర్కాప్ లారీ వెళుతుండగా ఆపి.. తనిఖీలు చేశారు. అదే సమయంలో డబ్బులు డిమాండ్ చేయడంతో.. ఈ విషయాన్ని కంపెనీ యాజమాన్యానికి డ్రైవర్ తెలిపారు. ఆ పరిశ్రమకు చెందిన యజమాని.. కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశారు. అక్కడ్నుంచి డీజీపీకి ఫోన్ కాల్ వచ్చింది. డీజీపీ ఆదేశాల మేరకు సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్‌ను వీఆర్‌కు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి బాజ్‌పాయ్ పంపినట్లు సమాచారం. వీరి స్థానాల్లో ఏర్పేడు సీఐ జయచంద్ర, రేణిగుంట అర్బన్ ఎస్‌ఐ అరుణ్ కుమార్ ఇన్‌చార్జులుగా ఆదివారం బాధ్యతలు స్వీకరించినట్లు తెలిసింది. దీనిపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజును వివరణ కోరగా.. ఘటన జరిగింది వాస్తవమేనని తెలిపారు. దీనిపై వివరణ ఇవ్వాలని డీఐజీ ఆదేశించడంతో వారు అనంతపురానికి వెళ్లారన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:26 (సోమవారం సాయంత్రం)
సహర్: 5:00 (మంగళవారం ఉదయం)

'అమరజీవి'కి ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు మార్గం అనుసరణీయమన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో దేవేంద్రరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ, సాధికార అధికారిణి జ్యోత్స్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

విద్యార్థులూ.. ఆల్ ది బెస్ట్

నేటి నుంచి 'పది' పరీక్షలు

తిరుపతి(విద్య/కలెక్టరేట్/నేరవిభాగం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి 31వ తేది వరకు.. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు పరీక్షలు మొదలవుతాయి. ఆయా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందే హాజరు కావాలని అధికారులు సూచిస్తున్నారు. ఇక, ఆదివారానికే పరీక్షా కేంద్రాలున్న తరగతి గదుల్లో డెస్కులపై హాల్‌టికెట్ నెంబర్లు వేశారు. ఆయా కేంద్రాల వద్ద బయట ఆయా హాల్‌టికెట్ నెంబర్ల ఆధారంగా కేటాయించిన తరగతి గదుల వివరాలతో నోటీసు బోర్డులు పెట్టారు. ఇక, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాల్‌టికెట్లలోని పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకుని నోటీసు బోర్డుల్లో తమ, తమ పిల్లల రూమ్ నంబర్లను నోట్ చేసుకున్నారు. లోపలకు అనుమతించిన కేంద్రాల్లో తమకు కేటాయించిన గదుల్లోకి వెళ్లి హాల్‌టికెట్ నంబర్ల ప్రకారం వారి స్థానాలను చూసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం చెప్పారు. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకుని, ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇక, తమ ఇళ్ల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లను చూపి పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సు సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. స్వస్థలాల నుంచి, లేదా బస్టాండ్, రైల్వే స్టేషన్ల నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు ఈ అవకాశాన్ని కల్పించారు. ఇక, జిల్లా వ్యాప్తంగా 28,656 మంది విద్యార్థులు పరీక్షలు రాసే 164 కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 10 మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు.



పరీక్షా కేంద్రాల వద్ద హాల్‌టికెట్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

పోలీసు అధికారులు

కావలెను!

- తిరుపతి డీఎస్పీ, ఈస్ట్, వెస్ట్ సీఐలుగా ఇన్‌చార్జులు
- స్పెషల్ బ్రాంచికి డీఎస్పీ లేరు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు వ్యవస్థను సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లా కేంద్రమైన తిరుపతి నగర డీఎస్పీ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తుండిన వెంకటనారాయణను బదిలీ చేసిన ప్రభుత్వం రెగ్యులర్ డీఎస్పీని నియమించలేదు. తాత్కాలికంగా మహిళా స్టేషన్ డీఎస్పీ శ్రీలతను ఇన్‌చార్జిగా నియమించారు. వీఐపీల తాకిడి, రాత్రి గస్తీలు, శాంతి భద్రతల పరిరక్షణ వంటివి కష్టతరమవుతున్నాయి. డివిజన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో ఈస్ట్, వెస్ట్‌లకు రెగ్యులర్ సీఐలు లేరు. వెస్ట్ సీఐగా పనిచేస్తుండిన రామకృష్ణను గతంలో ఎస్పీ సుబ్బరాయుడు ఇన్‌చార్జి సీఐగా అటాచ్‌మెంటు కింద నియమించారు. మొన్నటి వరకు వీఆర్‌లో ఉన్న మురళీమోహన్‌రావును తాత్కాలికంగా వెస్ట్ సీఐగా అటాచ్‌మెంట్ ఇచ్చారు. మరోవైపు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన గిరిధర్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఆయన మళ్లీ జాయిన్ అవుతారనే విషయం అనుమానంగానే ఉందన్న చర్చ నడుస్తోంది. జిల్లా మొత్తం స్పెషల్ బ్రాంచ్ వ్యవహారాలు సీఐ ఒక్కరే చూస్తున్నారు. అతను కూడా కొత్తగా బాధ్యతలు స్వీకరించడంతో జిల్లాపై పూర్తి స్థాయి అవగాహన లేదు. తిరుపతి ప్రాముఖ్యత దృష్ట్యా పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లా వ్యాప్తంగా

కార్డెన్ సెర్చ్

- 137 వాహనాల తనిఖీ.. 34 సీజ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం తెల్లవారజామున పోలీసులు అనుమానిత ప్రాంతాలు, కాలనీల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తిరుపతి వెస్ట్ సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఇందిరానగర్, ఎన్టీఆర్ సర్కిల్, తదితర ప్రాంతాల్లో పోలీసులు కార్డెన్ సెర్చ్ చేశారు. ఇందిరానగర్‌లో పోలీసులు ఇంటింటికీ వెళ్లి వారి అడ్రస్సులు, ఆధార్ కార్డులు పరిశీలించారు. 58 వాహనాలు తనిఖీ చేసి ఎలాంటి రికార్డులు లేని 30 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. శ్రీకాళహస్తి టూటౌన్ పరిధిలో వీఎంపల్లెలో 32 వాహనాలు తనిఖీ చేసి నాలుగు సీజ్ చేశారు. పుత్తూరు పరిధిలోని ముద్దుకృష్ణపురంలో 32 వాహనాలు.. నాగలాపురంలోని దొడ్డిమెట్ట ఎస్టీ కాలనీలో 15 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు సీఐ సురేంద్ర నాయుడు, సీఐలు ఓబయ్య, వెంకటేశ్వర్లు, సునిల్‌కుమార్, నాగలాపురం ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరులో పెద్దిరెడ్డి ఆటలు సాగనివ్వం

- అమరావతికి 15 రోజుల్లో రావాలంటూ చల్లాకు సీఎం చంద్రబాబు సూచన
- అశ్రునయనాల మధ్య టీడీపీ కార్యకర్త అంత్యక్రియలు

పుంగనూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఇకపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆటలు సాగవని, టీడీపీ శ్రేణులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త కాగతి రామకృష్ణను శనివారం వేటకొడవలితో వైసీపీ కార్యకర్త వెంకట్రమణ హత్య చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం ఉదయం 12 గంటలకు అంత్యక్రియలు జరగాల్సి ఉంది. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా వచ్చి రామకృష్ణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పబోగా కుటుంబీకులు నిరాకరించారు. తమకు న్యాయం జరిగేవరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దాడులు, అక్రమ కేసులు, దెబ్బలు తిన్న తాము.. ఇప్పుడూ తప్పులు చేయకపోయినా అదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని, ఇప్పుడు కుటుంబ పెద్దను కోల్పోయామని రామకృష్ణ భార్య దేవమ్మ, కుమారులు శివ, సురేశ్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రభుత్వంలోనూ న్యాయం జరగకపోతే ఏమి చేయాలని ప్రశ్నించారు. దీంతో చల్లా వెంటనే సీఎంకు ఫోన్ చేసి.. వీరితో మాట్లాడించారు. 'రామకృష్ణ హత్య దురదృష్టకరం.టీడీపీ అండగా ఉంటుంది. ఆందోళన చెందొద్దు. త్వరలోనే మంత్రులు, పార్టీ పెద్దలు మిమ్మల్ని కలుస్తారు. అంత్యక్రియలు చేయండి' అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అనంతరం చల్లాతో 10 నిమిషాలు సీఎం చంద్రబాబు ఫోన్లో మాట్లాడారు. అసెంబ్లీ తర్వాత 15 రోజుల్లో అమరావతికి రావాలని సూచించారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి అరాచకాలు అడ్డుకుంటూ.. పార్టీ శ్రేణుల సమస్యలపై చర్చించాలని, ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తవహించాలని చెప్పారు. రామకృష్ణను చంపినవారికి చట్టప్రకారం శిక్షపడేలా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. 'గతంలో దాదాపు 700 మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులపై వైసీపీ నేతలు అక్రమంగా 307 కేసులను పెట్టి ఇబ్బంది పెట్టారు. ఈ కేసులను ఎత్తివేయాలి. కార్యకర్తలు మన.. గత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం చూస్తున్నారు' అని సీఎంతో చల్లా అన్నారు. కాగా, సీఎం భరోసా ఇచ్చాక రామకృష్ణకు కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ నేతలు, శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.



రామకృష్ణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పుతున్న ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

త్వరలోనే హంతకులను పట్టుకుంటాం: డీఎస్పీ

రామకృష్ణ హత్యకు కారకులైన వారిని పట్టుకోవడానికి నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. సీసీ ఫుటేజీ, సెల్‌ఫోన్ ట్రాకింగ్, సాంకేతిక ఆధారాలపై దృష్టి పెట్టామన్నారు. సీఐని సస్పెండ్ చేశామని, ఈకేసుపై విచారణ జరుగుతోందన్నారు. రామకృష్ణ హత్య నేపథ్యంలో కృష్ణాపురంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది.

వైసీపీ ముసుగు తీయండి

- వారితో అంటకాగితే స్థాన చలనం తప్పదు
- పోలీసులకు శాప్ చైర్మన్ హెచ్చరిక

తిరుపతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'కొన్ని పోలీస్ స్టేషన్లు ఇప్పటికీ వైసీపీ ముసుగు కప్పుకుని ఉన్నాయి. కొందరు అధికారులు వైసీపీ నేతలతో అంటకాగుతున్నారు. ఇప్పటికే అధినాయకుడి దృష్టికి వారి జాబితా వెళ్లింది. అలాంటివారిని ఉపేక్షించేదిలేదు' అని శాప్ చైర్మన్ రవి నాయుడు హెచ్చరించారు. తిరుపతిలో ఆదివారం జరిగిన కూటమి నాయకుల సన్మాన కార్యక్రమంలో రవినాయుడు మాట్లాడారు. పార్టీ అధికారంలో ఉండి కూడా కార్యకర్తలను పోగొట్టుకుంటున్నామంటే పోలీసుల అలసత్వమే కారణమన్నారు. 'ప్రాణహాని ఉదంటూ పుంగనూరులో టీడీపీ కార్యకర్త రామకృష్ణ వీడియో పెట్టిన తర్వాత కూడా పోలీసులు చోద్యం చూశారు. అనంతరం ఆయన హత్యకు గురయ్యారు. ఇటీవల వైసీపీ నిర్వహించిన యువత పోరులో కొందరు కలెక్టరేట్ గేట్లు విరిచి, ఎన్‌హెచ్‌పై ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తే వారిని వదిలిపెట్టేశారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా వైసీపీ నేత అభినయ్ రెడ్డి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో హల్‌చల్ చేస్తే కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు. మా నాయకులపైన కేసులు పెట్టడం, సమస్యపైన వెళితే తాత్సారం చేయడంలో మాత్రం అత్యుత్సాహం చూపుతున్నారు. కార్యకర్తల మనోభావాలు కాపాడే విషయంలో మూడు పార్టీలు ఒకే నిర్ణయంతో ఉన్నాయి' అని రవినాయుడు అన్నారు.

కార్యకర్తల కష్టంతోనే

మనకీ పదవులు

- 'కూటమి' నాయకులకు ఘన సన్మానం

'గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంతో తలపడిన కూటమి కార్యకర్తల కష్టంతోనే మనకు ఈ పదవులు దక్కాయి. దశల వారీగా అందరికీ న్యాయం చేసేందుకు పార్టీ ముఖ్యులు సిద్ధంగా ఉన్నారు' అని నాయకులు అన్నారు. నామినేటెడ్, పార్టీ పదవులు పొందిన కూటమి నేతలు.. శాప్ చైర్మన్ రవి నాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయలపాలెం విజయ కుమార్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కుమారమ్మ, కరాటే చంద్ర, బాలసుబ్రమణ్యంను ఆదివారం సత్కరించారు. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్ ఆధ్వర్యంలో తిరుపతిలోని నిర్మల రామయ్య కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. సన్మాన గ్రహీతలతో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి ప్రసంగించారు. కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకుంటున్న కూటమి నేతలు

మొబైల్ టాయిలెట్లకు తాళాలు



తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్ ముందున్న మొబైల్ టాయిలెట్లకు తాళాలు వేశారు. శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో జరుగుతున్న అనాధికార విక్రయాలపై 'వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోనూ విక్రయాలా!' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. ఎలాంటి అనుమతులూ లేకుండా ప్రైవేట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వ్యక్తులు తినుబండారాలను భక్తులకు విక్రయించడమే కాకుండా క్యూకాంప్లెక్స్ ముందున్న వినియోగంలో లేని మొబైల్ టాయిలెట్లలో టెట్రా జ్యూస్ ప్యాకెట్లను నిల్వ ఉంచుతున్నారు. దీనిపై వార్తలు వచ్చిన క్రమంలో టెట్రా జ్యూస్ ప్యాకెట్లను తొలగించడంతో పాటు టాయిలెట్లకు తాళాలు వేశారు. అలాగే వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లలోకి ప్రైవేట్ వ్యక్తులు ప్రవేశించి విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు విజిలెన్స్ సిబ్బందిని ఆదేశించారు.

తల్లికి వందనం హర్షణీయం



ధనలక్ష్మమ్మ జన్మదిన వేడుకల్లో సాకం నాగరాజు తదితరులు

తిరుచానూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సమాజం పట్ల బాధ్యతతో మాకం దామోదరం గుప్త నిర్వహించిన తల్లికి వందనం కార్యక్రమం హర్షణీయమని తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు అన్నారు. ఆదివారం తిరుచానూరు సమీపంలోని దత్తాత్రేయ ఆలయంలో దామోదర గుప్త తల్లి ధనలక్ష్మమ్మ 92వ జన్మదిన వేడుకల్లో సాహితీ మిత్రులు పాల్గొని ఆమెను ఘనంగా సత్కరించారు. రొటేరియన్ దామోదర గుప్త పుస్తకప్రియులు, సామాజిక చింతన కలిగిన డాక్టర్ నాగులూరు దయాకర్, డాక్టర్ ఎం.ఆదిశేషయ్య, గరికపాటి రమేష్‌బాబు, ఇస్లాపురం బాలసుబ్రహ్మణ్యం, హరీష్‌కు విలువైన పుస్తకంతో పాటు రూ.5వేలు బహూకరించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయితలు ఆకుల మల్లేశ్వరరావు, దూబగుంట రామకృష్ణ కవి, డాక్టర్ పొక్కళ్ల సుభద్ర, ఎం.శారద, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు ఆదిశేషయ్య పాల్గొన్నారు.

వెంకన్న సేవలో జస్టిస్ వెంకటరమణ



జస్టిస్ దుప్పల వెంకటరమణ - జస్టిస్ భవాని సుబ్బరాయన్

తిరుమల, మార్చి16(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవానీ సుబ్బరాయన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సేవలో డిప్యూటీ సీఎం ఓఎస్డీ



ఆలయం ముందు కృష్ణతేజ

తిరుమల, మార్చి16(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్డీ ఐఏఎస్ అధికారి కృష్ణతేజ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకున్న కృష్ణతేజకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

వైసీపీని బలోపేతం చేసుకుందాం



తిరుపతిరూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): వైసీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేసుకుందామని చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. తుమ్మలగుంటలోని తన స్వగృహంలో ఆదివారం ఆర్‌సీపురం మండలానికి చెందిన ముఖ్యనేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాధ్యక్షుడిగా నియమితులైన ఎ.చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నూతన మండలాధ్యక్షుడు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు

భాకరాపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే వరకు విశ్రమించకూడదని గీతాంజలి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆదివారం సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులతో ఓం చిత్రాన్ని వేయించి క్యాండిల్స్ వెలిగించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. హెచ్ఎం స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకగా సూర్యభగవానుడి తిరుచ్చి ఉత్సవం



తిరుచానూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న సూర్యనారాయణస్వామికి ఆదివారం అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం హస్త పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితులైన సూర్యనారాయణస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్ నాయుడు, అఖండం శీను పాల్గొన్నారు.

చంద్రగిరి

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం	**: రూ.4కోట్లు**
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు	**: 82,580**
తలనీలాలు సమర్పించినవారు	**: 31,905**

నృత్యం ముగ్ధ మనోహరం



తిరుచానూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా చెన్నైకు చెందిన కల్పవార్షిక ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యం ముగ్ధమనోహరంగా సాగింది. కళాకారులు జనని, మేనక, శశేనక, శివనీయశ్రీ, వేదప్రియ, సుదర్శన వాస్తవ్, సహన, శ్రీనిధి, కావ్య తదితరులు మల్లారి, గజవదన, బృందావన నిలయే, అంతయు నీవే, దుర్గాలక్ష్మి సరస్వతి, మురళీధర గోపాల, వరణ అయిరాం, శ్రీనివాస కల్యాణం, మదుమైకుం కన్నె, ముత్తయితు మురగా వంటి కీర్తనలకు భరతనాట్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

చంద్రగిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 9వ తేదీన మండలంలోని తొండవాడ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీ, గాంధీపురానికి చెందిన నారాయణ(45)కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆసుపత్రిలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి వేద సమ్మేళనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేద విశ్వవిద్యాలయంలో సోమవారం నుంచి దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనం మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అనుగ్రహ భాషణం అంతర్జాలం ద్వారా చేస్తారు. వేద, సంస్కృత వర్సిటీ వీసీలు రాణీసదాశివమూర్తి, కృష్ణమూర్తి, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొంటారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధ వేద పండితులకు వేద పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎర్రావారిపాలెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి); మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో వెంకట సుబ్రమణ్యం తెలిపారు. ఎర్రావారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెరబైలు, బోడేవాండ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరిగే పరీక్షలకు 267 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

భాకరాపేట : పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. చిన్నగొట్టిగల్లు, భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, డెస్కులు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

రామచంద్రాపురం : మండలంలో పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో మార్కొండేయనాయుడు తెలిపారు. మండలంలో 256మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. నెత్తకుప్పం, కుప్పంబాదూరు, కమ్మకండ్రిగ, కట్టకింద వెంటకాపురం, సొరకాయలపాళెం కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మెడికల్ క్యాంప్, 144 సెక్షన్ విధించనున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

చంద్రగిరి : మండలంలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు లలితకుమారి, భాస్కర్‌బాబు తెలిపారు. 11 ప్రభుత్వ, మూడు ప్రైవేటు పాఠశాలల నుంచి 7 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, 9 గంటలకే కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ ఇద్దరికి గాయాలు



గాయపడిన జనార్దన్

వరదయ్యపాళెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఆది వారం చిన్నపాండూరు నక్కలమిట్ట సమీ పంలోని మాదరపాక్కానికి చెందిన జనార్దన్ తన ద్విచక్ర వాహనంపై సత్యవేడు వైపు వెళ్తుండగా వరదయ్యపాళెం మీదుగా వస్తున్న బత్తలవల్లానికి చెందిన సుబ్రహ్మణ్యం ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిని చిన్నపాండూరు ఆస్పత్రికి తరలిం చారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు

కేవీబీపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రామచంద్ర తన సొంత పనుల నిమిత్తం శ్రీకాళహస్తికి ఆదివారం ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. గురుకుల కండ్రిగ రోడ్డు క్రాస్ సమీపంలో అదుపు తప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి ఆయన్ను 108 అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు.

రెండు కార్లు ఢీ : తొమ్మిది మందికి గాయాలు



కాశిపెంట్ల సమీపంలో ఢీకొన్న రెండు కార్లు



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

చంద్రగిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశిపెంట్ల వద్ద పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం ముందు వెళుతున్న కారును వెనుక వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర, ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కడప నుంచి శ్రీనివాసన్, మంజునాథ, గీతా, భాగ్యలక్ష్మి, సువార్త, అరవింద్‌కుమార్ కారులో కుప్పంకు వెళుతున్నారు. కాశిపెంట్ల సమీపంలో తిరుపతికి చెందిన భువనాదిత్య, వరప్రసాద్, సాయికుమార్ వ్యక్తిగత పనులపై కారులో చిత్తూరు వైపు వెళుతున్నారు. అదుపుతప్పి ముందు వెళుతున్న కారును ఢీకొట్టారు. దీంతో ముందు వెళుతున్న కారు టైరు పంక్చరై పక్కనున్న కల్వర్టును ఢీకొంది. అందులోని శ్రీనివాసన్, మంజునాథలకు తీవ్ర గాయాలు కాగా, గీతా, భాగ్యలక్ష్మి, సువార్త, అరవింద్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. మరో కారులోని భువనాదిత్య, సాయికుమార్, వరప్రసాద్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ అధికారులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చంద్రగిరిలోని సీహెచ్‌సీ, తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడాయ్ నూతన కార్యవర్గం



తిరుపతి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక లీలామహల్ సమీపంలో ఉన్న విఘ్నేశ్వర టవర్స్ కార్యాలయంలో ఆదివారం క్రెడాయ్ సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కె.గోపినాథ్, ప్రెసిడెంట్‌గా ఎం.రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.రాజేష్‌బాబు, ట్రెజరర్‌గా పి.నరసింహారెడ్డి, జాయింట్ సెక్రటరీగా పి.శ్రీనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. వీరిని పలువురు ఘనంగా సన్మానించి, అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో సంస్థ అభివృద్ధి, ప్రజాహిత కార్యక్రమాలపై చర్చించారు. ఎన్నికల అధికారిగా వెంకయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ క్రెడాయ్ ట్రెజరర్ పి.రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

శ్రీవారి మెట్టు వద్ద భక్తుల కిటకిట



శ్రీవారి మెట్టు వద్ద కిటకిటలాడుతున్న భక్తులు

చంద్రగిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారి మెట్టు వద్ద ఆదివారం భక్తులు కిటకిటలాడారు. వారాంతపు సెలవులు.. ఇంటర్ పరీక్షలు ముగియడం.. పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఒక్కసారిగా తిరుమల శ్రీవారి దర్శనానికి రద్దీ పెరిగింది. శ్రీవారి మెట్టు వద్దా ఇదే పరిస్థితి. ఇదే అదునుగా ఆటోవాలాలు భక్తులను నిలువు దోపిడి చేస్తున్నారు. శ్రీవారి మెట్టు మార్గంలో కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు రోజువారీ ఇస్తున్న టైమ్ స్లాట్ దర్శన టోకెన్లు.. ఆదివారం మూడు వేలు మాత్రమే ఇచ్చారు. సుమారు పది వేల మంది భక్తులు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లడానికి శ్రీవారిమెట్టు మార్గానికి చేరుకున్నారు. ఈ టోకెన్లు ఉదయం 6 నుంచి పంపిణీ ప్రారంభమవుతుంది. వేకువజామున 2 గంటల నుంచే భక్తులు శ్రీనివాసమంగాపురానికి చేరుకుంటున్నారు. శ్రీనివాసమంగాపురం వద్ద రద్దీ పెరగడంతో శ్రీవారిమెట్టు మార్గంలోని పంప్ హౌస్ వద్ద బారికేడ్లు పెట్టి వరుస క్రమంలో నిలిపేసి, ఉదయం 6 గంటల తరువాత శ్రీవారిమెట్టు వద్దకు అనుమతిస్తున్నారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మౌలిక వసతులు కల్పించక పోవడంతో అవస్థపడ్డారు. శ్రీనివాసమంగాపురంలో ఉండే స్థానికంగా ఉన్న ఆటోలనే టీటీడీ సెక్యూరిటీ ముందు అనుమతిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఉదయం సమయంలో టీటీడీ భక్తుల కోసం ఉచిత బస్సు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఆటోవాలాలు తమకు ఇష్టం వచ్చినట్లు భక్తుల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవాలనే ఉద్దేశంతో ఆటోవాలాలు అడిగినంత ఇచ్చేస్తున్నారు. టోకెన్ సమయానికి శ్రీవారిమెట్టుకు వెళ్తితే ఒక్కో భక్తుడు నుంచి రూ.500 నుంచి వెయ్యి రూపాయాలు వసూలు చేస్తున్నారు. టీటీడీ కాలినడకన వచ్చే భక్తులకు సరిపడ టోకెన్లు ఇవ్వకపోవడమే ఆటోవాలాలు ఇంత డిమాండ్ చేస్తున్నారు. శ్రీవారిమెట్టు మార్గంలో ప్రతి రోజూ టీటీడీ ఇస్తున్న టోకెన్ల సంఖ్య ఒక్కో రోజు ఒక్కో విధంగా ఇస్తుండటంతో భక్తులు శ్రీవారిమెట్టు వద్దకు వచ్చి టోకెన్లు లేక వెనుతిరుగుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



శ్రీవారిమెట్టు మార్గంలోని పంప్ హౌస్ వద్ద నిలిపివేసిన వాహనాలు

పేరూరులో బస్‌షెల్టర్ ఆక్రమణ



బస్‌షెల్టర్ స్థానంలో రేకులషెడ్డు నిర్మించిన దృశ్యం

తిరుపతిరూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ పంచాయతీ పరిధిలో చంద్రగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చీనీ, నిమ్మపరిశోధనా స్థానం(సిట్రస్) ప్రహరీకి సమీపంలో గతంలో బస్‌షెల్టర్ ఉండేది. కాలక్రమంలో ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ స్థలంపై ఆక్రమణదారుల కన్నుపడింది. దీన్ని ఆక్రమించి తాత్కాలిక రేకులషెడ్డును నిర్మించారు. కాగా, పరిశోధనా స్థానం నుంచి ఎస్వీ వ్యవసాయ కళాశాల వరకు హద్దుగా నిర్మించిన ప్రహరీకి వెలుపలివైపు ఉన్న ఖాళీ స్థలంలో ఇప్పటికే పలుచోట్ల దారిపొడవునా తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. తాజాగా బస్‌షెల్టర్ స్థలంలో రేకులషెడ్డుని ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రహదారి ప్రస్తుతం విద్యానగర్ నుంచి కాలూరుక్రాస్ వరకు జాతీయ రహదారి పరిధిలోకి చేరింది. దీంతో ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని అంటున్నారు.

మొండిపంట.. అధిక ఆదాయం

● ఆర్‌సీపురంలో జోరుగా ఆయిల్‌ఫాం సాగు



గంగిరెడ్డిపల్లెలో ఆయిల్‌ఫాం తోటలను నాటుతున్న రైతులు

రామచంద్రాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చీడపీడల నేపథ్యంలో సంప్రదాయ పంటలతో పాటు ఉద్యానవన పంటల్లో నష్టపోతున్న రైతులు ఆయిల్‌ఫాం సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ ఇస్తుండటంతో ఆర్‌సీపురం మండలంలో ఈ ఏడాది 85 ఎకరాల్లో 33 మంది రైతులు ఆయిల్‌ఫాం సాగు చేపట్టారు. ఎకరా తక్కువ లేకుండా ఆయిల్‌ఫాం సాగు చేసే రైతుకు ప్రభుత్వం మొక్క రూ.193 చొప్పున 57 మొక్కలను వంద శాతం సబ్సిడీతో అందిస్తోంది. ఇందులో అంతరపంట సాగు చేస్తే ఏడాదికి రూ.4వేలు చొప్పున నాలుగేళ్ల పాటు రూ.16వేలు సబ్సిడీ అందజేస్తుంది. ఆయిల్‌ఫాం నాటిన నాలుగేళ్లకే ఎకరాకు 3 నుంచి 4 టన్నుల దిగుబడి ఇస్తుంది. పూర్తి స్థాయిలో 7వ సంవత్సరం నుంచి కాపుకొచ్చి 25 ఏళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. ఈ సమయంలో 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. కంపెనీ రైతు పొలం వద్దకు వచ్చి టన్ను రూ.17,500 కొనుగోలు చేస్తుంది. క్రిమికీటకాల బెడద లేదు. పెద్దగా ఎరువుల వాడకం అవసరం లేదు. ఎకరా పొలంలో ఏడాదికి అన్ని ఖర్చులు పోను రూ.1.50లక్షలు రైతుల చేతికి అందుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



ఆయిల్‌ఫాం నీటి పంట

ఒక ఆయిల్‌ఫాం చెట్టు రోజుకు 300 లీటర్ల నీటిని తీసుకుంటుంది. పొలంలో 2.50 ఇంచి నీరు ఉన్న రైతులు సాగు చేయాలి. ఇది చీడపీడలు లేని మొండి పంట. పశువులు కూడా చెట్టుజోలికి రాదు. పెద్దగా ఎరువుల వాడకం కూడా లేదు.

- ఉద్యానవన శాఖాధికారి సునీల్



ఆయిల్‌ఫాం సాగు మంచిది

వరి, వేరుశనగ, చెరకు పంటలు సాగు చేసినా పెద్దగా ఆదాయం రావడంలేదు. ఉద్యాన పంటలు జామ, మామిడి, పూలతోటల్లో నాలుగేళ్లగా నష్టాలు వస్తున్నాయి. ఆయిల్ ఫాం సాగులో పెద్దగా నష్టాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పాటు మంచి ఆదాయాలు కూడా వస్తున్నాయి.

- రైతు బ్రహ్మానందరెడ్డి, గంగిరెడ్డిపల్లె

కూటమి ప్రభుత్వంలో ఆలయాలకు రక్షణేదీ?: భూమన

తిరుపతి (జీవకోన), మార్చి 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఆలయాలకు రక్షణ లేదని వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాశీనాయన క్షేత్రానికి సంబంధించి అన్నదాన సత్రాన్ని కూల్చివేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. దీనిపై చంద్రబాబు, పవన్ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఏపీలో ఆలయాల విధ్వంసం, శ్రీవారి క్షేత్రంలో జరుగుతున్న అనాచారం, దళారీల మయంగా మారిన పవిత్ర క్షేత్రాలు కాషాయ దళానికి కనిపించడంలేదా అని ప్రశ్నించారు.

అమరజీవికి ఘన నివాళి


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు రిజర్వు కార్యాలయంలో ఆదివారం అదనపు ఎస్పీ రవిమనోహరాచారి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు. ఆర్ఐలు వెంకటరమణా రెడ్డి, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేతల నివాళి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రుయా ఆస్పత్రి వద్దవున్న ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలువేసి, నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, జయంత్‌కుమార్, సురేష్‌స్వామి, హనుమంతరావు పాల్గొన్నారు.

టీటీడీపై నగరపాలక సంస్థ జట్టు గెలుపు


విజేత నగరపాలక సంస్థ క్రికెట్ జట్టు

తిరుపతి(క్రీడలు), మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ క్రీడా మైదానంలో జరుగుతున్న మెగా కార్పొరేట్ క్రికెట్ లీగ్‌లో ఆదివారం టీటీడీ మాస్టర్ బ్లాస్టర్స్ జట్టుపై నగరపాలక సంస్థ విజయం సాధించింది. తొలుతగా బ్యాటింగ్ చేసిన టీటీడీ మాస్టర్ బ్లాస్టర్స్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నగరపాలక సంస్థ జట్టు 14.4 ఓవర్లలో లక్ష్యాన్ని సునాయాశంగా ఛేదించింది. నాలుగు వికెట్లు తీసుకుని టీటీడీ మాస్టర్ బ్లాస్టర్స్ జట్టును కుప్పకూల్చిన మల్లికార్జునకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. నగరపాలక సంస్థ జట్టును కమిషనర్ మౌర్య, ఇతర అధికారులు అభినందించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపక సంఘం అధ్యక్షుడిగా రవి



పదవీ స్వీకార ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

తిరుపతి(విద్య), మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా చంద్రగిరి జూనియర్ కళాశాల ఎకనమిక్స్ అధ్యాపకులు వి.రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం తిరుపతిలో జరిగాయి. ఉపాధ్యక్షుడిగా పి.రాజనాల(చంద్రగిరి జూనియర్ కళాశాల కెమిస్ట్రీ అధ్యపకుడు), కార్యదర్శిగా సి.వంశీకృష్ణ (చంద్రగిరి జూనియర్ కళాశాల జువాలజీ అధ్యాపకుడు), సంయుక్త కార్యదర్శిగా టి.ఆర్.చక్రధర్ (పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ కళాశాల మ్యాథ్స్ అధ్యాపకుడు), కోశాధికారిగా బి.అనిల్‌కుమార్ (సత్యవేడు జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకుడు), మహిళా కార్యదర్శిగా డాక్టర్ పి.అమ్ముదేవి (పుత్తూరు ఎస్ఆర్ఎస్ కళాశాల తమిళ అధ్యాపకుడు), డాక్టర్ కె.రవీంద్రబాబు (వెంకటగిరి జూనియర్ కళాశాల మ్యాథ్స్ అధ్యాపకుడు), వి.ఎన్.రవి (వరదయ్యపాళెం కళాశాల ఎకనమిక్స్ అధ్యాపకుడు) రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. ఈ కమిటీ మూడేళ్లపాటు కొనసాగనుంది.

వినాయకసాగర్‌లో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న డీబీఆర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది

తిరుపతి (జీవకోన), మార్చి 16(ఆంధ్రజ్యోతి): శ్రీవినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కరకంబాడీ రోడ్డులోని సాగర్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డీబీఆర్ ఆస్పత్రి వైద్యబృందం నేతృత్వంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వాకర్స్ వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు రవిరాజు, అధ్యక్షుడు సాంబశివారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు సుకుమార్‌రాజు, సహాయ కార్యదర్శి సాయికృష్ణమరాజు, లీగల్ అడ్వైజర్ దేవర మనోహర్, మంజుల, కో-ఆర్డినేటర్ చంద్రమోహన్, సభ్యులు చంద్రశేఖరరావు, వెంకటేశ్వర్లు, నిరంజన్‌నాయుడు, శివానందరెడ్డి, ప్రకాష్, రామమూర్తి, రాజు, నరసింహులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ నమూనా పరీక్షకు స్పందన


నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి16(ఆంధ్రజ్యోతి): భవానీనగర్ రాజన్నపార్క్ సమీపంలోని శ్రీగగన కోచింగ్ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ నమూనా పరీక్షకు విశేష స్పందన వచ్చినట్లు సంస్థ డైరెక్టర్ ఎ.కరుణామూర్తి పేర్కొన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని, ఇందులో ప్రతిభచాటిన విద్యార్థులకు రెండు నెలలు ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం మేలో నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు, సిలబస్ వంటి ఇతర వివరాల కోసం కేంద్రంలో సంప్రదించవచ్చని తెలిపారు.


నగరంలోని పట్నూలు వీధిలో రేణుక పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి

19నుంచి ఈశా ఇన్నర్ ఇంజనీరింగ్

తిరుపతి అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీ రోడ్‌లోని సప్తగిరికాలనీలో గల కమ్మ సంఘం హాల్లో ఈ నెల 19 నుంచి ఈశా ఇన్నర్ ఇంజనీరింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ ఫౌండేషన్ తిరుపతి సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కిషోర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సులభమైన యోగా సాధనలు, తరగతులు, సద్గురు సూచనలతో రూపొందించిన ప్రక్రియలు ఉంటాయని పేర్కొన్నారు. రోజూ ఉదయం 6-7, సాయంత్రం 6-7 గంటల మధ్య ఉంటుందని, ఆసక్తి గలవారు పాల్గొనవచ్చునని, మరిన్ని వివరాలకు 9849584208 సంప్రదించాలని కోరారు.

సీబీఎస్‌లో జరిమానా సూచికలు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 16(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టేషన్‌లో ఆదివారం జరిమానా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. బస్టాండు ఆవరణలో అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి, బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే రూ.100 జరిమానా చెల్లించాలని అందులో పొందుపరిచారు. ఈ నిబంధనలు సోమవారం నుంచి అమలు చేస్తామని ఇప్పటికే అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే.

టీపీటీ సంఘం అధ్యక్షుడిగా రూపేష్


రూపేష్‌ను అభినందిస్తున్న సంఘం నేతలు

తిరుపతి అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం తిరుపతి ప్రైవేట్ ట్రావెల్స్ నూతన కార్యవర్గం ఎంపికైంది. కన్వీనర్ బొడుగు మునిరాజయాదవ్ ఎన్నికల అధికారిగా వ్యవహించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా రూపేష్, ప్రధాన కార్యదర్శిగా బాషా, కోశాధికారిగా మల్లికార్జున్ నియమితులయ్యారు. వారిని పలువురు అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం పూర్వ ప్రతినిధులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మునిచంద్ర, రాము, మురళి పాల్గొన్నారు.

నేడు సాధువుల పాదయాత్ర


మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసానందస్వామి

తిరుపతి అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను కాపాడుకుందామనే నినాదంతో పలు రాష్ట్రాలకు చెందిన సాధువులు సోమవారం ఉదయం అలిపిరి మెట్లమార్గంలో పాదయాత్ర చేయనున్నారు. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు ఆదివారం సాయంత్రం లీలామహల్ కూడలి చేరుకున్నారు. అభయహస్త సేవా మండలి ఉపాధ్యక్షుడు జగన్నాథం స్వాగతం పలికి, విశ్రాంతి ఏర్పాట్లు చేశారు. ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి మాట్లాడుతూ జూపార్కు రోడ్డులో శేషాచలం అటవీ ప్రాంతానికి సమీపంలో ఒబరాయ్ హోటల్ నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలి


వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మూలమైన పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలని ఆకాశవాణి మాజీ డైరెక్టర్ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సభ తిరుపతిలోని అన్నమాచార్య కళా మందిరంలో ఆదివారం నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ముంబైలో రైల్వే ఉద్యోగం చేశారని, గాంధీ ప్రభావానికి లోనై, సబర్మతి ఆశ్రమానికి వెళ్లారని చెప్పారు. క్విట్ ఇండియా ఉద్యమంలో జైలుకు వెళ్లారని తెలిపారు. హరిజనులకు దేవాలయ ప్రవేశం కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రజల కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములని కొనియాడారు. అంతకుముందు టీటీడీ అధికారులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో ఆనందరాజు పాల్గొన్నారు.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె



దీక్షా శిబిరంలో బైఠాయించిన వెటర్నరీ విద్యార్థులు

తిరుపతిరూరల్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధానగేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

- బొమ్మగుంట రవి, దుద్దేల బాబును సస్పెండ్ చేసిన నగర అధ్యక్షుడు
- మమ్మల్ని సస్పెండ్ చేసే అధికారం నీకు లేదంటూ సోషల్ మీడియాలో పోస్టులు

తిరుపతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : తిరుపతి వైసీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. నగర అధ్యక్షుడిగా మల్లం రవిచంద్రా రెడ్డిని నియమించడంపై వైసీపీ బీసీ నేత బొమ్మగుంట రవి అసంతృప్తితో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరలై రాజకీయంగా చర్చకు దారితీసింది. 'వైసీపీలో అంతా వాళ్లేనా?' అనే శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో అతను పెట్టిన పోస్టు సారాంశంతో వార్తగా ప్రచురితం కావడంతో పార్టీ నాయకత్వం అప్రమత్తమైంది. వివాదానికి కారణమైన బొమ్మగుంట రవితో పాటు దుద్దేల బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు నగర అధ్యక్షుడు తన లెటర్ హెడ్‌పై ప్రకటించారు. దీంతో దుద్దేల బాబు, బొమ్మగుంట రవిలు వివిధ వాట్సప్ గ్రూపుల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టులు చేశారు. తాము అనేక జిల్లా, రాష్ట్ర పదవులు చేశామని, మమ్మల్ని పార్టీ నుంచి తప్పించే అధికారం నగర అధ్యక్షుడికి లేదని విరుచుకుపడ్డారు. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి లేదా జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డిలు మాత్రమే మమ్మల్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు చెప్పాలని స్పష్టం చేశారు. వీరికి మద్దతుగా పలువురు బీసీ, దళిత సంఘాల నాయకులు నిలిచారు. బీసీ వర్గాలకు చెందిన నాయకులను సస్పెండ్ చేసినట్లుగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు పార్టీ గురించి, నాయకుల గురించి దూషించారని, వారిపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. అధికారంలో లేనప్పుడు కూడా వైసీపీలో కులవివక్ష చూపడం ఏమిటని మండిపడుతున్నారు. కాగా, పార్టీపై, నాయకులపై దూషణలకు పాల్పడటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీకి నష్టాన్ని కలిగించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.


చేపల మార్కెట్ వద్ద స్తంభించిన ట్రాఫిక్ - రోడ్డుపైనే చేపలను శుభ్రం చేస్తున్న కూలీలు - మురుగునీటి ప్రవాహాన్ని దాటుతున్న కొనుగోలుదారులు

ఆదివారం వస్తే అవస్థలే

- చేపల మార్కెట్ వద్ద సమస్యలెన్నో!


చేపల వ్యర్థాలను కాలువలో పడేస్తున్న కూలీ (ఇన్‌సెట్‌లో) కాలువలో వ్యర్థాలు

తిరుపతి అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆదివారం వస్తే చాలు చేపల మార్కెట్ వద్ద సమస్యలతో జనం సతమతమవుతున్నారు. జనసమూహం, ట్రాఫిక్ జామ్, దుర్వాసన వెరసి అష్టకష్టాలు పడుతున్నారు. నడిరోడ్డుపైనే చేపలను శుభ్రం చేస్తుండడంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. దుకాణాల వద్ద పోగైన చేపల వ్యర్థాలు ఎప్పటికప్పుడు పక్కనే ఉన్న పెద్ద కాలువలో పడేస్తుండడంతో నిండిపోతోంది. దీంతో మురుగునీటి ప్రవాహం స్తంభించి, దుర్వాసన వెదజల్లుతోంది. చేపల మార్కెట్ నగర నడిబొడ్డున ఉండడంతో ఈ సమస్య వస్తోందని, వెలుపలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా సాధికారతే రాస్ ధ్యేయం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


వికలాంగులకు వీల్‌చైర్లు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, చిత్రంలో సుగుణమ్మ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ధ్యేయంగా రాష్ట్రీయ సేవా సమితి(రాస్) కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగర పరిధిలోని కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం రాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు మహిళాభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. తిరుపతిలో కొన్నేళ్లుగా రాస్ మహిళల అభ్యున్నతికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి రాస్ ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ రాస్ ఆరు గ్రామాల నుంచి సేవలను ప్రారంభించి ఆరు రాష్ట్రాలకు విస్తరించిందన్నారు. అనంతరం వృద్ధులకు చేతికర్రలు, దుప్పట్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్ టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కెనరాబ్యాంక్ ఏజీఎం నాగరాజారావు, రాస్ జాయింట్ సెక్రటరీ మమత, డైరెక్టర్ వి.నాగరాజు పాల్గొన్నారు.

నేడు ఏపీ బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ సోమవారం ఎస్వీ యూనివర్సిటీకి రానున్నారు. శేషాచలం కొండల్లోని జీవ వైవిధ్యంపై నిర్వహించనున్న సదస్సులో ఆయన పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ప్రారంభమయ్యే సభలో టీటీడీ జేఈవో వెంకయ్య చౌదరి, వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, డీఎఫ్ఓ వివేక్, తుడా కార్యదర్శి వెంకటనారాయణ, తదితరులు పాల్గొంటారని సమన్వయకర్తలు హరికృష్ణ పాకనాటి, పత్తిపాటి వివేక్, మద్దినేని హరిబాబు తెలిపారు.

తెలుగు మాధురి పురస్కారాల ప్రదానం


ఉషారాణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు మాధురి పురస్కారాలు ప్రదానం చేశారు. యూత్ హాస్టల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో షీటీం సుమతి, పద్మావతి కాలేజీ తెలుగు అధ్యాపకురాలు కృష్ణవేణి, రచయితలు పేరూరు బాలసుబ్రమణ్యం, షాజహాన్ తదితరులకు ఈ పురస్కారాలను అందజేశారు. నిర్వాహకులు ఉషారాణి ఆధ్వర్యంలో పలువురు రచయితలు కవితా పఠనం చేశారు. సాహిత్యవేత్తలు పాల్గొన్నారు.

పశ్చిమ కనుమల్లో వృక్ష వైవిధ్యం పరిశీలన


పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ బోటనీ పీజీ విద్యార్థులు పశ్చిమ కనుమల్లోని వృక్ష వైవిధ్యాన్ని పరిశీలించారు. మూడు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా వారు హొగనేకల్, టీ ఫ్యాకర్టరీ బ్రెడ్ గార్డెన్, ఊటీ కొండలు, అతిరేపల్లె జలపాతం, కేరళ ప్రాంతాలను సందర్శించారు. కొన్ని ప్రత్యేకత కల్గిన మొక్కల భాగాలను సేకరించారు. వీటిని హెర్బేరియం షీట్‌ల ద్వారా భద్రపరచనున్నారు. కార్యక్రమంలో బోటనీ హెడ్ నాగలక్ష్మి, అధ్యాపకులు కామాక్షి, వేణు, అంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

18 నుంచి అన్నమాచార్య ఉత్సవాలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు అన్నమాచార్య ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తిరుపతి శ్రీత్యాగరాజస్వామి కల్చరల్ ట్రస్ట్ నిర్వాహకులు మోహన్ సుందరం, కంచి రఘురామ్ వెల్లడించారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ 80 సంవత్సరాలుగా త్యాగరాజ స్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది అన్నమాచార్య సంకీర్తన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ సంగీత విద్వాంసులు ఎమ్మెస్ సుబ్బులక్ష్మి మనవరాళ్లు షణ్ముఖ ప్రియ, హరిప్రియ హాజరవుతారని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయండి



సభలో ప్రసంగిస్తున్న సుగుణాకరరావు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులకు ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పి.సుగుణాకరరావు కోరారు. తిరుచానూరులోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల మధ్య తారతమ్యం లేకుండా సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరారు. రెగ్యులేషన్లు, ప్రమోషన్లు, కరువుభత్యం చెల్లింపులు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, ఇతర సంక్షేమ పథకాలు యథావిధిగా అమలు చేయాలన్నారు. పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కారుణ్య నియామకాల్లో ప్రస్తుతమున్న నిబంధనలను అమలు చేయాలన్నారు. బకాయి ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదనరెడ్డి, కె.వెంకటేశ్వరరావు, రమేష్, మూర్తి పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పొట్టి శ్రీరాముల త్యాగం చిరస్మరణీయం



గూడూరులో పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తదితరులు

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాముల జయంతి సందర్భంగా స్థానిక పాత బస్టాండు సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అశువులు బాశారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ నేడు సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సోమిశెట్టి చెంచురామయ్య, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్‌కుమార్, చంద్రమౌళి, అమరయ్య, రమేష్, నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా రూరల్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్, కనమర్లపూడి సుబ్రహ్మణ్యంశెట్టి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోటా వెంకటేశ్వర్లు, యతి, కిరణ్, రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలో పొట్టి శ్రీరాములు క్యాంస విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

నాయుడుపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. ఎల్‌ఏ సాగరం గురుకులంలో 270 మంది, నారాయణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో 226మంది, ఎల్‌ఏ సాగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 260 మంది, జడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో 180 మంది, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 236మంది, సెయింట్ మేరీస్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 212మంది పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

వెంకటగిరి టౌన్: మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటగిరి పట్టణంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, ఆర్వీఎం ఉన్నత పాఠశాల, ఏపీఆర్ఎస్, ఏపీ మోడల్ స్కూల్, ఎస్టీ ఫ్రాన్సిస్ స్కూల్ కేంద్రాల్లో 1245 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఓజిలి: మండలంలోని ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 93మంది, చిల్లమానుచేను జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 143మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఎంఈవో ఎంఈవో శైలజ తెలిపారు.

బాలయపల్లి: మండల కేంద్రమైన బాలయపల్లిలో 81 మంది, వెంగమాపురంలో 38మంది, జయంపులో 38మంది, నిడిగల్లులో 36మంది, పిగిలాంలో 32 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో ప్రదీప్ తెలిపారు.

కోట: మండల కేంద్రమైన కోటలో ఆరు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. మొత్తం 971 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

దేవాంగులు ఐకమత్యంతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేవాంగులు ఐకమత్యంతో మెలిగితే అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించవచ్చని నెల్లూరు జిల్లా దేవాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో దేవాంగుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు, అనారోగ్యంతో ఉన్న వారికి వైద్య చికిత్స కోసం సంఘం ద్వారా ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శంకరయ్య, మాధవయ్య, శేషు, చంద్రశేఖర్, మదిరబాలయ్య, కొండా శేఖర్, శ్రీనివాసులు, హరికృష్ణ, సునీల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



మాంసం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు మాంసం విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంస దుకాణాల్లో నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రీజర్లలో నిల్వవుంచిన మాంసాన్ని విక్రయించినా, ప్లాస్టిక్ కవర్లలో మాంసాన్ని అందజేసినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరను విజయవంతం చేయండి

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలో ఈనెల 25వ తేదీ నుంచి జరగనున్న ముత్యాలమ్మ జాతరను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం జాతర ఆహ్వాన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టనున్నామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులను పొందాలన్నారు. కార్యక్రమంలో ఈవో నవీన్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, జలీల్‌అహ్మద్, నటశేఖర్, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఆళఘునాథస్వామి రథోత్సవం



గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అలంకరించి రథంపై అధిష్టింపజేసి, భక్తులు రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. పట్టణ పురవీధుల్లో రథోత్సవం వైభవోపేతంగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

కారు బోల్తా: వృద్ధురాలి మృతి



పెంచలమ్మ మృతదేహం

చిల్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని బోల్తా పడిన ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆదివారం వేకువజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గూడూరు అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన పెంచలమ్మ(76) శనివారం శ్రీకాళహస్తిలోని తన కుమార్తె సునీత ఇంటికి వెళ్లింది. కుమార్తె, ఇద్దరు మనవరాళ్లతో కలిసి కారులో గూడూరుకు బయలుదేరారు. కోట క్రాస్‌రోడ్డు సమీపంలో వస్తుండగా కారు అదుపుతప్పి జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టును ఢీకొన్ని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పెంచలమ్మ తీవ్రంగా గాయపడగా, ఆమె కుమార్తె, ఇద్దరు మనవరాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో పెంచలమ్మ మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





గుర్రప్పతోట సమీపంలో పచ్చిమిర్చి కోతలో కూలీలు - గోనె సంచిలో రవాణాకు సిద్ధం చేసి పచ్చిమిర్చి

పచ్చిమిర్చి కొనుగోళ్లలో దళారుల దందా

పతనమైన ధర, రైతుల్లో ఆందోళన

పెళ్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి సాగు చేసిన పచ్చిమిర్చి అమ్ముకుందామంటే దళారుల దందాతో ధరల పతనమవుతున్నాయి. పెళ్లకూరు మండలంలో రైతులు ప్రియాంక, బంగారం, వజ్రం తదితర రకాల పచ్చిమిర్చి సాగు చేశారు. మార్కెట్‌లో కిలో రూ.20 నుంచి రూ.25 ఉన్నప్పటికీ దళారులు రైతుల నుంచి రూ.14కే కొనుగోలు చేస్తుండటంతో పెట్టుబడి ఖర్చు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కానూరు, తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, రోసనూరు, దిగువ చావాలి, ఎగువ చావాలి, చెంబడిపాళెం, జీలపాటూరు తదితర గ్రామాల రైతులు వందలాది ఎకరాల్లో పచ్చిమిర్చి సాగు చేశారు. తొలినాళ్లలో పంట పచ్చదనంతో మురిపించినా వాతావరణంలో మార్పులు దెబ్బతీశాయి. మిర్చి పంటను ఎక్కువగా ఆకుముడత తెగుళ్ల ఆశించడంతో చాలా ప్రాంతాల్లో పంట దెబ్బతింది. పురుగు మందుల పిచికారితో పెట్టుబడి అంతకంతకూ పెరిగింది. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గినా ధరలు ఆశాజనకంగా ఉంటాయని భావించిన రైతులు పెట్టుబడి ఎక్కువైనా వెనకాడలేదు. అయితే పంట అమ్ముకునే సమయంలో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో కిలో రూ.20నుంచి రూ.25 ధర ఉన్నప్పటికీ దళారులు రైతుల వద్ద నుంచి కిలో కేవలం రూ.14కే కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు సంబంధిత శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో తూకాల్లోనే మోసం జరుగుతోందని, తాము నిర్ణయించిన ధరకే విక్రయించేలా దళారులు పెత్తనం చెలాయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





ముళ్లపొదలతో అధ్వానంగా ఉన్న చెరువుకట్ట - కట్టపై ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

చెరువుకట్ట సుందరీకరణ

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువుకట్ట సుందరీకరణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటుపాళెం జాతీయ రహదారి నుంచి గూడూరు పట్టణానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఓ వైపు ఒకటన్నర కిలోమీటరు మేర చెరువుకట్ట ఉంది. ఈ కట్టను ఆధునీకరించి అహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని వైసీపీ హామీ ఇచ్చినా గత ఐదేళ్లలో పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో చెరువుకట్టపై ముళ్లచెట్లు పెరిగిపోయి పొదలుగా మారి కళావిహీనంగా మారింది. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెరువు కట్టను ఆధునికీకరించి అందంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే కట్టను అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకున్నారు. ఆదివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో ఒకటన్నర కిలోమీటరు మేర చెరువుకట్టపై ముళ్లపొదలను తొలగింపు పనులు చేపట్టారు. జంగిల్ క్లియరెన్స్ అనంతరం తుడా ఆధ్వర్యంలో కట్టకు రివిట్‌మెంట్ చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్, లైటింగ్, పచ్చదనం పెంపు, పార్కును అభివృద్ధి, ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయంలో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సూళ్లూరుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చిన్నయ్య తెలిపారు. పట్టణ పరిధిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీకి గాయాలు



గాయపడిన సిద్దయ్య

సూళ్లూరుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ సిద్ధయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మన్నారు పోలూరుకు చెందిన సిద్ధయ్య ద్విచక్ర వాహనంపై సూళ్లూరుపేటకు వెళ్తుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్ధయ్యకు తీవ్రగాయాలు కాగా, టెంపోలోనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో దీపిక ప్రతిభ



దీపికకు మెడల్ అందజేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నాయుడుపేటకు చెందిన బి.దీపిక ప్రథమస్థానం సాధించినట్లు కోచ్ ఉయ్యాల పవన్‌కుమార్ తెలిపారు. జూన్‌లో జరగనున్న సౌత్ ఇండియా జోన్ తైక్వాండో పోటీల్లో దీపిక పాల్గొంటుందన్నారు.

తుమ్మూరులో చోరీ

నాయుడుపేట టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరులో చోరీ జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న సుబ్బయ్య నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసుకొని బంధువుల ఊరికి వెళ్లాడు. ఆదివారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి తలుపులను తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో దాచిన ఒక సవరం బంగారు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు.

దాడి ఘటనపై కేసు

పెళ్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన కోగిలి మణి శనివారం రాత్రి కర్రతో దాడి చేశాడు. గాయపడిన వెంకటేశ్వర్లును కుటుంబసభ్యులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి తరలించి చికిత్స చేయించారు. అనంతరం వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

దివ్యాంగులకు కూరగాయల అందజేత

గూడూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీసీ పార్కులో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో భాస్కర్ దాతృత్వంలో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రఫూఫ్, నాగరాజు, చెంచునారాయణ, రామమోహన్, ప్రభాకర్, ఇబ్రహీం, సురేష్, శ్రీనివాసాచారి, సుందరం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యాసరాలను అందజేశారు. కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునరెడ్డికి కురుగొండ్ల పరామర్శ



మల్లికార్జునరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డక్కిలి మండలం పలుగోడు గ్రామానికి చెందిన ఆదిరెడ్డి మల్లికార్జునరెడ్డిని ఆదివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. మల్లికార్జునరెడ్డికి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో చెన్నై అపోలో చికిత్స అందించారు. అనంతరం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే రామకృష్ణ ఆస్పత్రికి వెళ్లి మల్లికార్జునరెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికోల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు తదితరులు ఉన్నారు.

అంకులపాటూరులో గోదాము

చిల్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకులపాటూరులో నూతనంగా గోదామును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చిల్లకూరు పీఏసీఎస్ సీఈవో రాజనేని రామయ్యానాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు 75 కిలోల బస్తాకు నెలకు రూ.10 చెల్లించి గోదాములో ధాన్యం నిల్వ చేసుకోవచ్చన్నారు.

భగవద్గీతపై అవగాహన

వెంకటగిరి టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లమ్మ గుడి, శివాలయం వీధిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భగవద్గీతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, అమరావతి, శ్రీను, చామంతి, కృష్ణ, ప్రబోధ, లీలా కృష్ణ, వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్పీ వినోద్‌కుమార్

పెళ్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీల్లో భాగంగా ఆదివారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో జరిగిన ఉపాధి పనుల వివరాలను డీఆర్పీ వినోద్‌కుమార్ వెల్లడించారు. పనులకు రానివారి పేర్లతో మస్టర్లు వేశారని, పనులు చేసిన కొంతమందికి వేతనం చెల్లించలేదని కూలీలు ఆరోపించారు. గ్రామసభలో ఫిర్యాదు చేసిన ప్రతి విషయాన్ని ఉన్నతాధికారులు తెలియజేసి చర్యలు తీసుకుంటామని వినోద్‌కుమార్ తెలిపారు.

కోటమ్మకు పూజలు



కోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలతో అలంకరించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై సదరన్ రైల్వే పరిధిలోని కవర్‌పేట, పొన్నేరి మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చెన్నై, నెల్లూరు మధ్య నడిచే పలు రైళ్లను రద్దు చేశారు. పొన్నేరి, కవర్‌పేట మధ్య పట్టాల మార్పిడి పనులు రెండు నెలలుగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు పనులు చేపట్టనున్నారు. ఆ సమయంలో రైళ్ల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నారు. చెన్నై - నెల్లూరు మధ్య నడిచే రైలు నెంబరు 6635, ఉదయం 8.10 నిమిషాలకు నెల్లూరు వైపు వెళ్లే రైలు, ఉదయం 10.30 గంటల సమయంలో నెల్లూరు నుంచి చెన్నైకి వెళ్లే రైలును పూర్తిగా రద్దు చేశారు. అలాగే చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే పలు సబర్బన్ రైళ్లు రద్దు అయ్యాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొంత ఆలస్యంగా నడిచే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు గూడూరు వరకే పినాకిని

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రైలు పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థల మరమ్మతుల కారణంగా సోమవారం విజయవాడ - చెన్నై సెంట్రల్ (నెం.12711) పినాకిని ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్‌కు బదులు గూడూరు వరకే నడుపనున్నారు. అలాగే, డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - విజయవాడ (నెం.12712) పినాకిని ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్‌కు బదులు సాయంత్రం 4.15 గంటలకు గూడూరు నుంచి బయల్దేరుతుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

గుమ్మిడిపూండి మార్గంలో 21 రైళ్ల రద్దు

చెన్నై సెంట్రల్ - గూడూరు మార్గంలో ఈ నెల 17న మరమ్మతులు చేపట్టనుండటంతో చెన్నై మూర్‌మార్కెట్ - గుమ్మిడి పూండి మార్గంలో నడిచే 21 లోకల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 17 ఉదయం 9.25 నుంచి మధ్యాహ్నం 2.25 వరకు ఈ మరమ్మతు పనులు జరుగుతాయని తెలిపారు.

విద్యానగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధాకర్‌రావు

కోట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో ఉన్న తపోవనంలో ఆదివారం నెల్లూరుకు చెందిన సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి 200 మంది శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకొని మందులు పొందారు. వంద మందికి కంట్లో శుక్లాలు ఉండటాన్ని పరీక్షల్లో గుర్తించారు. 50 మందిని నెల్లూరుకు తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్లు సుధాకర్‌రావు, సువర్ణ తెలిపారు.

జూనియర్ కళాశాలల అధ్యాపక సంఘం అధ్యక్షుడిగా రవి



పదవీ స్వీకార ప్రమాణం చేస్తున్న ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘ నూతన కార్యవర్గం

తిరుపతి(విద్య), మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా చంద్రగిరి జూనియర్ కళాశాల ఎకనమిక్స్ అధ్యాపకులు వి.రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం తిరుపతిలో జరిగాయి. ఉపాధ్యక్షుడిగా పి.రాజనాల (చంద్రగిరి జూనియర్ కళాశాల కెమిస్ట్రీ అధ్యపకుడు), కార్యదర్శిగా సి.వంశీకృష్ణ(చంద్రగిరి జూనియర్ కళాశాల జువాలజీ అధ్యాపకుడు), సంయుక్త కార్యదర్శిగా టి.ఆర్.చక్రధర్ (పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ కళాశాల మ్యాథ్స్ అధ్యాపకుడు), కోశాధికారిగా బి.అనిల్‌కుమార్ (సత్యవేడు జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకుడు), మహిళా కార్యదర్శిగా డాక్టర్ పి.అమ్ముదేవి(పుత్తూరు ఎస్ఆర్ఎస్ కళాశాల తమిళ అధ్యాపకుడు), డాక్టర్ కె.రవీంద్రబాబు(వెంకటగిరి జూనియర్ కళాశాల మ్యాథ్స్ అధ్యాపకుడు), వి.ఎన్.రవి(వరదయ్యపాళెం కళాశాల ఎకనమిక్స్ అధ్యాపకుడు) రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. ఈ కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది.

జనసేనలో కష్టపడే వారికి గుర్తింపు

వెంకటగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జనసేనలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త జంపాల ప్రకాష్ అన్నారు. ఆదివారం పట్టణంలో పింజల వీరయ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసిన జనసైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. రాధమ్మ, చిరంజీవులు పాల్గొన్నారు.

19నుంచి ఈశా ఇన్నర్ ఇంజనీరింగ్

తిరుపతి అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేటీ రోడ్‌లోని సప్తగిరికాలనీలో గల కమ్మ సంఘం హాల్లో ఈనెల 19నుంచి ఈశా ఇన్నర్ ఇంజనీరింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈశా ఫౌండేషన్ తిరుపతి సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కిషోర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సులభమైన యోగా సాధనలు, తరగతులు, సద్గురు సూచనలతో రూపొందించిన ప్రక్రియలు ఉంటాయని పేర్కొన్నారు. రోజూ ఉదయం 6-7, సాయంత్రం 6-7 గంటల మధ్య ఉంటుందని, ఆసక్తి గలవారు పాల్గొనవచ్చున్నారు. మరిన్ని వివరాలకు 9849584208 సంప్రదించాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు ఎమ్మెల్యే సుధీర్ శుభాకాంక్షలు

శ్రీకాళహస్తి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు భయాన్ని వీడి ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువు చదివి భవిష్యత్తులో మంచి ఉద్యోగావకాశాలు పొందేందుకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ అనేక పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారన్నారు. మంచి వాతావరణంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం



బీఎన్‌కండ్రిగ పరీక్ష కేంద్రం గదిలో హాల్ టిక్కెట్ నెంబర్లు బోర్డుపై రాస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు రూపేష్ కుమార్, గిరిజ, డిపార్ట్‌మెంట్ అధికారులు శ్రీనివాసులు, ఆదిశేషయ్య తెలిపారు. ఏ, బీ కేంద్రాల్లో 306 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఏ సెంటర్‌లో 165 మంది, బీ సెంటర్‌లో 141 మందిని కేటాయించామన్నారు. చల్లమాంబపురం, పల్లమాల, బీఎన్‌కండ్రిగ, నెలవాయి ప్రభుత్వ పాఠశాలలతో పాటు శ్రీనివాసతేజ, ఎస్వీఆర్, అక్షర ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఎంఈవో రవి తెలిపారు. మండలంలోని 9 హైస్కూళ్ళు, రెండు గురుకుల పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 594 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలుర గురుకుల పాఠశాల, బాలికల గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ అధికారులు, 30 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు ఎంఈవో తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కాగా పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఏదైనా జిరాక్స్ దుకాణాలు ఉంటే మూసి వేయాలని ఎస్ఐ సూచించారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ హైస్కూలులో రెండు కేంద్రాలుగా విభజించి ఏ కేంద్రంలో 171మంది, బీ కేంద్రంలో 141మంది మొత్తం 312 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో హేమమాలిని తెలిపారు. ప్రతి విద్యార్థికీ డెస్క్ కేటాయించామన్నారు. విద్యార్థులు 9 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి: సీఐటీయూ

సత్యవేడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మెలుగు రమేష్ కోరారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని, వంట సామగ్రి సరఫరా చేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని తదితర డిమాండ్లతో విజయవాడలో చేపట్టనున్న మహా ధర్నాకు మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాంతి, లక్ష్మి, శ్యామల, రత్నమ్మ, ప్రభావతి, చంద్రమ్మ, విజయనిర్మల, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

మార్కెట్ దారి సమస్య పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే భానుప్రకాష్



టీడీపీ నాయకులతో కలిసి మార్కెట్‌లో వసతులు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పుత్తూరు అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న దారిని పునః ప్రారంభించడానికి రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. గతంలో రైల్వే అధికారుల మూసివేసిన దారి సమస్యను వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం ధ్యాన కేంద్రం వద్ద ఉన్న చాముండేశ్వరి మల్లాలమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, కార్యదర్శి ఎస్.ఎస్.ధనపాల్, డీఎస్ ఎలుమలై, గణేష్, యుగంధర్, దిలీప్, ఆనంద్, మురళి, కోలా సుధ, ట్యాక్సీ గోపీనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ భువన తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులు హోమియోతో నయం



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ నానా నాయక్

పుత్తూరు, మార్చి16(ఆంధ్రజ్యోతి): కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల నయానికి హోమియో వైద్యంతో ఫలితాలు కనబడుతాయని హోమియో వైద్య నిపుణుడు నానా నాయక్ అన్నారు. పట్టణంలోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 'హోమియో వైద్యం - నమ్మలేని నిజాలు' అంశంపై అవగాహన సదస్సు జరిగింది. సొరియాసిస్, కిడ్నీలో రాళ్లు, వివిధ అలర్జీలు, మూలశంఖ, ఫిస్టులా, పక్షవాతం, వెన్నముక సమస్యలకు శస్త్రచికిత్స అవసరం లేకుండా హోమియో మందులతో నయమవుతాయన్నారు. ఈ మందులు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా పనిచేస్తాయని తెలిపారు. అలోపతితో పాటూ హోమియో మందులను కూడా వాడుకోవచ్చని సూచించారు. తర్వాత కేకేసీ హోమియో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. డాక్టర్లు శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రాజు, రవిరాజు, కెఎల్ఎన్‌మూర్తి, రఫీఅహ్మద్, మునికృష్ణయ్య, గుణశేఖర్‌రెడ్డి, కెకెసి ఛైర్మన్ కుప్పయ్యశెట్టి, హోమియో డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

నేటి టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వడమాలపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు పద్మావతి, తులసిరాం తెలిపారు. కాగా అన్ని గదుల్లో బల్లలు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం ఎనిమిది పాఠశాల నుంచి 320 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 115 మంది, బాలికల పాఠశాలలో 75 మంది పరీక్ష రాయనుండగా పత్తి పుత్తూరు, సీతారామాపురం హైస్కూల్ విద్యార్థులు రామచంద్రాపురం మండలంలోని సొరకాయల పాళ్యం కేంద్రంలో, తడుకు ఆర్ఎస్, శ్రీబొమ్మరాజపురం హైస్కూల్ విద్యార్థులు పుత్తూరు మండలం గొల్లపల్లి హైస్కూల్, రాచపాల్యం హైస్కూల్‌లలో పరీక్షలకు హాజరుకానున్నారు.

పుత్తూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెన్త్ పరీక్షా కేంద్రాల్లో అన్ని రకాల వసతుల ఏర్పాటు చేశామని పుత్తూరు డివిజన్ డీవైఈవో ప్రభాకర్‌రాజు తెలిపారు. పుత్తూరు మండలంలో 1,437 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని చెప్పారు.

వైసీపీ విద్యార్థి విభాగ అధ్యక్షుడిగా కార్తీక్

శ్రీకాళహస్తి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పట్టం కార్తీక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి ఆయనను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తానని పేర్కొన్నారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవన నిర్మాణాలు





కేవీబీపురం కేజీబీవీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న అదనపు గదులు - రాయపేడులో పునాదులకే పరిమితమైన సచివాలయం

కేవీబీపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు కార్యాలయాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కళత్తూరులో రూ.17లక్షలతో ప్రారంభించిన హెల్త్ క్లినిక్ భవనానికి సంబంధించి గోడలు, శ్లాబ్ మాత్రమే పూర్తయింది. మిగిలినవి అసంపూర్తిగానే ఉన్నాయి. అలాగే కేవీబీపురం పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2023లో కొత్తగా ప్రవేశపెట్టిన ఇంటర్మీడియట్ కోసం గదులు నిర్మించాలని మొదలుపెట్టి అర్థంతరంగా ఆపేశారు. అటు గదులు పూర్తి కాలేదు.. ఇటు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. చెట్ల కిందనే తరగతులు జరుపుతున్నారు. సుమారు 12 గదులను రూ.60లక్షల అంచనాతో ప్రారంభించి వదిలేశారు. రాయపేడులో సచివాలయం, రైతు భరోసా కేంద్రానికి అని ప్రస్తుత ఎమ్మెల్యే గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. పునాదులు వేసి పిల్లర్ల వరకు పనులు చేసి అర్థంతరంగా వదిలేశారు. దీంతో అవి తుప్పు పట్టి కంపచెట్లకు నిలయంగా మారాయి. కూటమి ప్రభుత్వంలోనైనా అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలకు మోక్షం కల్పిస్తారా అని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి





శ్రీకాళహస్తి పట్టణంలోని బజారువీధిలో ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో, బీఎన్‌కండ్రిగ కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములుకు నివాళులు

శ్రీకాళహస్తి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధిలో కొలువై ఉన్న వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్యులు మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించారన్నారు. ఆయన పోరాటం కారణంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. కాగా పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతిని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌కు విన్నవించినట్లు వారు చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జూలుగంటి మురళీమోహన్‌గుప్తా, పొట్టి చంద్రగుప్తా, భాస్కర్, నరేష్, మహేష్, చీదెళ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని బహదూరుపేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కూడా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళుల ర్పించారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష మాట్లాడే ప్రజలందరికీ ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం అవసరమని గుర్తించి రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్షతో ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చిరస్మరణీయులని తెలుగుభాష పండితులు యువశ్రీ మురళి అన్నారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం గురించి విద్యార్థులకు వివరించారు.

మార్కెట్‌లో పెద్ద చేపలకు పెరిగిన డిమాండ్



మూడు వేల రూపాయలకు అమ్ముడుపోయిన 15 కిలోల కట్ల చేపలు

రేణిగుంట, మార్చి 16, (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో పెద్ద చేపలకు డిమాండ్ పెరిగింది. సాధారణంగా ఆదివారం చికెన్, మటన్‌కు డిమాండ్ ఉంటుంది. అయితే గత నెల నుంచి మాంసంప్రియులు చేపలను కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం సముద్ర చేపలతో పాటు డ్యాం, చెరువు చేపలను అధికంగా విక్రయిస్తుంటారు. స్థానిక రైల్వే హాస్పిటల్ ఎదురుగా ఆదివారం 15 కిలోల కట్ల చేపలను కొనేందుకు కొనుగోలుదారులు పోటీ పడ్డారు. మామూలుగా కిలో రూ. 145 పలికే కట్ల చేప కిలో రూ.200 చొప్పున రూ.3 వేలతో కొనుగోలు చేశారు.

విద్యుత్ ఉద్యోగులకు ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయండి



సభలో ప్రసంగిస్తున్న సుగుణాకరరావు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులకు ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పి.సుగుణాకరరావు కోరారు. తిరుచానూరులోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల మధ్య తారతమ్యం లేకుండా సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరారు. రెగ్యులేషన్లు, ప్రమోషన్లు, కరువుభత్యం చెల్లింపులు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, ఇతర సంక్షేమ పథకాలు యథావిధిగా అమలు చేయాలన్నారు. పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కారుణ్య నియామకాల్లో ప్రస్తుతమున్న నిబంధనలను అమలు చేయాలన్నారు. బకాయి ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మధుసూదన రెడ్డి, కె.వెంకటేశ్వరరావు, రమేష్, మూర్తి పాల్గొన్నారు.

పట్టాల కోసం అంబళ్లు పోసి నిరసన



అంబళ్లతో రిలే దీక్ష చేస్తున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు వేమాలమ్మకు ఆదివారం అంబళ్లు పోసి ఆ దుత్తలతో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల మనస్సు మార్చి తమకు ఇంటి పట్టాలు ఇచ్చే విధంగా అమ్మవారిని వేడుకుని అం బళ్లు పోసినట్లు తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండి పోయారు. క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.4కోట్లు వచ్చినట్లు అధికారులు చెప్పారు. ఇక శనివారం శ్రీవారిని 82,580 మంది దర్శించుకోగా 31,905 మంది తలనీలాలు సమర్పించారు.

నేడు సాధువుల పాదయాత్ర

తిరుపతి అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను కాపాడుకుందామనే నినాదంతో పలు రాష్ట్రాలకు చెందిన సాధువులు సోమవారం ఉదయం అలిపిరి మెట్లమార్గంలో పాదయాత్ర చేయనున్నారు. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు ఆదివారం సాయంత్రం లీలామహల్ కూడలి చేరుకున్నారు. అభయహస్త సేవా మండలి ఉపాధ్యక్షుడు జగన్నాథం విశ్రాంతి ఏర్పాట్లు చేశారు. ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి మాట్లాడుతూ జూపార్క్ రోడ్డులో ఒబెరాయ్ హోటల్ నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

గతుకులమయంగా బాదూరు రోడ్డు

● దగ్గరి దారిలో అవస్థల ప్రయాణం

వడమాలపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంట నుంచి రామచంద్రాపురం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే బాదూరు రోడ్డు గతుకులమయంగా మారింది. మండలంలోని పలు గ్రామాలకు దగ్గరి దారి కావడంతో రామచంద్రాపురం, తిరుపతి నుంచి ప్రజలు అవస్థలు పడుతూ ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తుంటారు. ఎప్పుడో వేసిన రోడ్డు ప్రస్తుతం రాళ్లు తేలిపోయింది. చిన్నపాటి గుంతలు గత వర్షాలకు పెద్ద గోతులుగా మారాయి. రాత్రి సమయాల్లో ఈరోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి తిరుపతి, రామచంద్రాపురం మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు ఈ గతుకుల రోడ్డులోనే వస్తూ పోతున్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లుగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



రాళ్లు తేలిన బాదూరు రోడ్డు

రెండు ద్విచక్ర వాహనాల ఢీ ఇద్దరికి గాయాలు



గాయపడిన జనార్దన్

వరదయ్యపాళెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం చిన్నపాండూరు నక్కలమిట్ట సమీపంలోని మాదరపాక్కానికి చెందిన జనార్దన్ తన ద్విచక్ర వాహనంపై సత్యవేడు వైపు వెళ్తుండగా వరదయ్యపాళెం మీదుగా వస్తున్న బత్తలవల్లానికి చెందిన సుబ్రహ్మణ్యం ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిని చిన్నపాండూరు ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు

కేవీబీపురం,మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రామచంద్ర తన సొంత పనుల నిమిత్తం శ్రీకాళహస్తికి ఆదివారం ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. గురుకుల కండ్రిగ రోడ్డు క్రాస్ సమీపంలో అదుపు తప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి ఆయన్ను 108 అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు.

పరీక్షా సామగ్రి వితరణ



కేవీబీపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరు పాఠశాలలో ఆదివారం టెన్త్ విద్యార్థులు సుమారు 137 మందికి మండల జనసేన అధ్యక్షుడు మోహన్ పరీక్షా సామగ్రిని వితరణ చేశారు.

యువతరం సేవాసమితి సభ్యులకు సన్మానం



యువతరం సేవాసమితి సభ్యులను సన్మానిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పొన్నూరులో ఆదివారం మన పొన్నూరు బ్లడ్ అసోసియేషన్ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలకు చెందిన వారిని సన్మానించారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు సేవలు వంటి వాటికి సభ్యులను ఘనంగా సత్కరించారు.